దేవాదులపై బీజేపీ దెబ్బ

ఉమ్మడి వరంగల్ సాగుపై కేంద్రం కత్తి ● ఇచ్చంపల్లి ఆనకట్టు ప్రతిపాదనతో ప్రమాదం

ఇదే జరిగితే నామమాత్రంగా సమ్మక్క బరాజ్ ● సమ్మక్క లేకుంటే దేవాదుల పంపులకు నీళ్లుండవు

ఉమ్మడి రాష్ట్రంలో గరిష్ఠంగా 3 నెలలే పంపింగ్ ● కేసీఆర్ హయాంలో సమ్మక్క బరాజ్ నిర్మాణం

59 గేట్లతో 92 మీటర్ల ఎత్తుతో నిర్మాణం పూర్తి ● ఇప్పుడు ఏడాది పొడవునా దేవాదుల పంపింగ్

దేవాదులతో 6.21 లక్షల ఎకరాల ఆయకట్టు ● 7.50 లక్షల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణ

దేవాదులను పూర్తిగా వరంగల్‌కు కేటాయించిన కేసీఆర్ ● ఇచ్చంపల్లి ప్రతిపాదనతో మళ్లీ నీళ్లు అందని దుస్థితి

వరంగల్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నదుల అనుసంధానం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదన ఇప్పుడు దేవాదుల ప్రాజెక్టు ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్నది. బీజేపీ సర్కార్ ప్రతిపాదించిన ఇచ్చంపల్లి ఆనకట్ట ఇప్పుడు సమ్మక్కబరాజ్ (తుపాకులగూడెం)ను ఉపయోగించుకోలేని పరిస్థితిని సృష్టిస్తున్నది. దీంతో వరంగల్ జిల్లాలో సాగునీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. గోదావరి జలాలను కావేరి నదికి తరలించేందుకు చేస్తున్న ఈ వ్యవహారం గోదావరి పక్కనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు శాపంగా మారనున్నది. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల పాటు ఎంతో శ్రమించి ప్రతి ఎకరాకు సాగునీటి వసతి కల్పించేందుకు చేసిన మంచి పనులు కేంద్ర ప్రతిపాదనతో బూడిదలో పోసిన పన్నీరులా మారే ప్రమాదం ఏర్పడింది. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల ఆయకట్టును పెంచడంతోపాటు అప్పటివరకు ఉన్న ఆయకట్టును స్థిరీకరించింది. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఏడాది పొడవునా తాగునీరు, రెండు పంటలకు సాగునీరు అందించేందుకు వీలుగా దేవాదుల పంపుహౌజ్ వద్ద నిత్యం నీళ్లు ఉండేలా ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో సమ్మక్క బరాజ్‌ను నిర్మించింది. గోదావరి నదిపై మేడిగడ్డ దిగువన 30 కిలోమీటర్ల సమీపంలో ఇచ్చంపల్లి బరాజ్ ప్రతిపాదిత ప్రదేశం ఉంటుంది. ఇచ్చంపల్లి నుంచి 20 కిలోమీటర్ల దిగువన గంగారం వద్ద దేవాదుల పంపుహౌజ్ ఉన్నది. ఇక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దిగువన సమ్మక్క బరాజ్‌ను నిర్మించారు. దీని నిర్మాణంతో బరాజ్ నుంచి దేవాదుల పంపుహౌజ్ వరకు పది కిలోమీటర్ల మేర నీళ్లు నిల్వ ఉంటాయి. ఏడాది పొడవునా దేవాదుల వద్ద పంపింగ్‌కు సరిపడా నీటి నిల్వలు ఉంటున్నాయి. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్రం ప్రతిపాదిస్తున్న ఇచ్చంపల్లి బరాజ్‌ను నిర్మిస్తే, తుపాకులగూడెం బరాజ్‌లో నీళ్లు ఉండవు. అదే జరిగితే దేవాదుల ప్రాజెక్టు, దీని కోసం నిర్మించిన సమ్మక్క బరాజ్ నిరుపయోగంగా మారుతాయి. నదుల అనుసంధానం స్ఫూర్తికి విరుద్ధంగా మహానది నుంచి గోదావరికి మిగులు జలాలను తరలించకుండానే, గోదావరి నుంచి కావేరికి నీటిని తరలించేలా అనుసంధాన ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం సిద్ధంచేసింది. తాగునీరు, సాగునీటి వసతులను పెంచేందుకు కృషిచేయాల్సిన కేంద్రం గోదావరి నది పక్కన ఉన్న ప్రాంతాలను ఎండబెట్టి, ఎక్కడో ఉన్న తమిళనాడుకు నీటిని తన్నుకుపోయే ప్రతిపాదనలు చేయడంపై సాగునీటిరంగ నిపుణులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క బరాజ్

కేసీఆర్‌తో సాగునీటిరంగంలో కొత్త శకం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సాగునీటి రంగంలో కొత్త శకం మొదలైంది. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసింది. దేవాదుల, ఎస్సారెస్పీ ఆయకట్టును స్థిరీకరించే లక్ష్యంతో సమ్మక్క బరాజ్‌ను 2017లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టారు. 2017 ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం రూ.2,121 కోట్ల నిధులను మంజూరు చేసింది. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ 2020 ఏప్రిల్ 22, 2020 అక్టోబర్ 13న రెండు దశలకు వేర్వేరుగా పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు వేగంగా జరిగాయి. ఈ బరాజ్‌ను 6.94 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. 14 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడం లక్ష్యంగా, 59 రేడియల్ గేట్లతో 1,143 మీటర్ల పొడవుతో ఈ బరాజ్‌ను నిర్మించారు. రూ.1,829 కోట్ల పనులు అయ్యాయి. తుపాకులగూడెంపై గంగారం వద్ద ఏర్పాటు చేసిన పంపులతో ఎత్తిపోతల ద్వారా దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందుతున్నది. సమ్మక్క బరాజ్ నిర్మాణంతో దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని హనుమకొండ, వరంగల్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లోని 6.14 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి వసతి ఏర్పడింది. దీంతోపాటు ఎస్సారెస్పీ పరిధిలోని 7.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అయింది. సాగునీటితోపాటు వరంగల్ మహానగరం సహా ఎన్నో గ్రామాలకు తాగునీరు అందుతున్నది.

> 'ఎస్సారెస్పీ పునరుజ్జీవంతో వరంగల్ ఉమ్మడి జిల్లా మీదుగా సూర్యాపేట, తుంగతుర్తి చివరి ఆయకట్టు వరకు నీటి కొరత తీరింది. దేవాదుల ప్రాజెక్టును పూర్తిగా వరంగల్ పాత జిల్లాకు అంకితం చేస్తాం.'
> - 2021 మే 21న వరంగల్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్

ఏడాది పొడవునా ఉండేలా

ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు నీళ్లు లేకుండా దేవాదుల ప్రాజెక్టు నిర్మాణ పనులు మొదలుపెట్టి, అలాగే పూర్తి చేసుకుంటూ పోయాయి. పదేండ్ల క్రితం వరకు దేవాదుల పంపుహౌజ్‌ల వద్ద గరిష్ఠంగా ఏడాదిలో మూడు నెలల కంటే ఎక్కువ రోజులు నీళ్లు ఉండేవి కావు. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద గోదావరి నీటి మట్టం 71 మీటర్లు ఉన్నప్పుడే మోటర్లతో నీళ్లను ఎత్తిపోసే పరిస్థితి ఉండేది. వానలు బాగా పడే రోజుల్లో మాత్రమే ఈ మేరకు నీటిమట్టం ఉంటుంది. వానకాలంలో గోదావరి నదిలో వరద ఉన్నప్పుడే మోటార్లు నడిచేవి. ఈ మోటర్లతో నీళ్లు రిజర్వాయర్లకు, అక్కడి నుంచి పొలాలకు చేరుతాయి. దేవాదుల పంపుహౌజ్ వద్ద గరిష్ఠంగా మూడు నెలలే 71 మీటర్ల మేరకు నీటి మట్టం ఉండేది. వానలు తక్కువగా ఉన్నా, గోదావరిలోకి వరద లేకున్నా నీటి ఎత్తిపోతల జరిగేది కాదు. గోదావరిలో పంపింగ్‌కు సరిపడా నీటి నిల్వ లేకపోవడంతో చాలా సీజన్లలో వానకాలం పంటలకు సైతం సాగునీరు అందలేదు. ఇలాంటి పరిస్థితిని మార్చేందుకు రెండు పంటలకు కచ్చితంగా సాగునీరు అందించాలని కేసీఆర్ ప్రభుత్వం తుపాకులగూడెం వద్ద సమ్మక్క బరాజ్‌ను నిర్మించాలని నిర్ణయించింది. 83 మీటర్ల మేరకు నీటిని నిల్వ చేసేలా 92 మీటర్ల ఎత్తుతో బరాజ్‌ను నిర్మించింది. దీంతో ఏడాది పొడవునా 71 మీటర్ల వరకు నీరు నిల్వ ఉంటున్నది. దేవాదుల, ఎస్సారెస్పీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందుతున్నది. కేంద్ర ప్రభుత్వ అనుమతితో నిర్మించిన ఈ బరాజ్‌ను పూర్తిగా నిరుపయోగంగా మార్చే విధంగా అదే బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు తమిళనాడులో తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఇచ్చంపల్లి బరాజ్ ప్రతిపాదనను తెర మీదకు తెచ్చింది.

దేవాదుల ప్రాజెక్టులో కొత్త రిజర్వాయర్లు

కొత్త రిజర్వాయర్లు	నీటి నిల్వ సామర్థ్యం(టీఎంసీ)
నష్కల్	0.548
నవాబుపేట	0.550
చీటకోడూరు	0.300
బొమ్మకూరు	0.198
కన్నబోయినగూడెం	0.120
లద్నూర్	0.296
తపాస్‌పల్లి	0.300
మొత్తం	2.312

పునరుద్ధరించిన రిజర్వాయర్లు, నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీలలో..)

రిజర్వాయర్లు	నీటి నిల్వ సామర్థ్యం
నర్సింగాపూర్	0.051
ధర్మసాగర్	1.500
పాలకుర్తి	0.422
చెన్నూరు	0.581
అశ్వరావుపల్లి	0.710
గండిరామారాం	0.400
వెల్దండ	0.150
ఐనాపూర్	0.120
మారెడ్డి చెరువు	0.120
స్టేషన్‌ఘన్‌పూర్	1.570
మొత్తం	5.624

సీతారామ అగమ్యగోచరం

మొదటిపేజీ తరువాయి...

బలిపెట్టాలని చూస్తున్నది. ఇచ్చంపల్లి బరాజ్ ఎత్తు పెంచితే దిగువన ఉన్న తెలంగాణ నీటి ప్రాజెక్టులకు నీళ్లు అందవు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నష్టం వాటిల్లుతుంది. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం కేసీఆర్ చేపట్టిన సీతమ్మ బరాజ్, సీతారామ ప్రాజెక్టులపై దీని ప్రభావం పడుతుంది.

సీతమ్మ బరాజ్‌కు నీళ్లు ఎలా?

ఇచ్చంపల్లి నుంచి నీటిని తరలించుకుపోతే దాని దిగువన ఉన్న సీతమ్మ బరాజ్, సీతారామ ప్రాజెక్టుల పరిస్థితి అగమ్య గోచరమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఇచ్చంపల్లిలో ప్రస్తుతం 87 మీటర్ల ఫుల్ రిజర్వాయర్ లెవల్ వద్ద 15.88 టీఎంసీల నీటి నిల్వ ఉంటుంది. బరాజ్ ఎత్తు పెంచితే 30 నుంచి 40 టీఎంసీల నీటి సామర్థ్యం ఉంటుంది. అక్కడి నుంచి నీటిని ఆయా మార్గాల ద్వారా తమిళనాడుకు తరలించి కావేరీ నదికి అనుసంధానం చేయాలని కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రయత్నిస్తున్నది. అదే జరిగితే, ఇచ్చంపల్లి దిగువన ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతమ్మ బరాజ్, సీతారామ ప్రాజెక్టులకు గోదావరి నీళ్లు అందని ద్రాక్షలా మారే ప్రమాదం ఉన్నదని ఇరిగేషన్ నిపుణులు చెప్తున్నారు. ఇక, గోదావరి నదిపై ఏపీ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు విషయంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చంపల్లి నుంచి దిగువకు నీళ్లు రాకపోతే పోలవరం బ్యాక్ వాటర్ ఉండదని, ముంపు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముంపు ప్రజలను ఖాళీ చేయించటంలో అంతరార్థం ఏమిటని నిలదీస్తున్నారు.

ఇచ్చంపల్లి ఎత్తు పెంచితే సీతమ్మ బరాజ్‌కు నీళ్లెట్ల?

ఇచ్చంపల్లి బరాజ్ ఎత్తు పెంచితే సీతమ్మసాగర్‌కు నీళ్లు రావడం కష్టమవుతుంది. కేసీఆర్ ఆశయాన్ని ముక్కలు చేసినట్టు అవుతుంది. నేడు గోదావరి జలాలు రైతులకు అందుతున్నాయంటే అది ఆయన పుణ్యమే. నీళ్ల కోసం కొట్లాడిన కేసీఆర్.. గోదావరిపై అనేక బరాజ్‌లు నిర్మించి తెలంగాణను సస్యశ్యామలం చేశారు. ఇప్పుడు బీజేపీ తన స్వార్థ రాజకీయాలకు తెలంగాణ నీళ్లను తమిళనాడుకు తీసుకెళ్తానంటున్నది. ఈ కుట్రను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు.

-రేగా కాంతారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, భద్రాద్రి కొత్తగూడెం

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసమే

బీజేపీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తెలంగాణలో నీళ్ల పేరుతో మంటలు పెడుతున్నది. జాతీయ ప్రయోజనాల కోసం ఏవైనా ప్రాజెక్టులు కట్టాలంటే కేంద్ర ప్రభుత్వం ముందుగా అఖిలపక్షంతో చర్చించాలి కదా? ఇచ్చంపల్లి విషయంలో అలా లేదు. దక్షిణాదిలో పట్టు కోసం బీజేపీ కుట్రలు చేస్తున్నది. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నది. కొన్ని ప్రాంతాల అవసరాల కోసం ఇతరులను బలిచేయటం సమంజసం కాదు.

-బండారు రవికుమార్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, కొత్తగూడెం

రాష్ట్రాల సత్సంబంధాలను దెబ్బతీసేందుకే

రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను దెబ్బతీసేందుకు, తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకొనేందుకే కేంద్రంలోని బీజేపీ ఇలాంటి కుట్రలు చేస్తున్నది. ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలను తరలించుకుపోతే.. దిగువన ఉన్న భద్రాద్రి జిల్లా రైతులు, ప్రజల పరిస్థితి ఏమిటి? జిల్లాకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం. గోదావరి జలాలను తమిళనాడుకు తీసుకెళ్లేందుకు భద్రాద్రి జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ బరాజ్ వంటి సాగునీటి వనరులను బలిచేస్తామంటే ఊరుకొనే ప్రసక్తే లేదు.

-ఎస్‌కే సాబీర్‌పాషా, సీపీఐ జిల్లా కార్యదర్శి, కొత్తగూడెం

రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నది

దక్షిణాదిన పట్టు పెంచుకోవటం కోసం ఇక్కడి రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టాలని బీజేపీ చూస్తున్నది. అందుకే నదుల అనుసంధానం, గోదావరి జలాల తరలింపు వంటి అంశాలతో కొత్త రాగం ఎత్తుకున్నది. ఇచ్చంపల్లి బరాజ్ ఎత్తు మళ్లీ పెంచితే అక్కడి ప్రాంతాలన్నీ జలమయమవుతాయి. దిగువకు నీరు రావటం కష్టమవుతుంది. భద్రాద్రి జిల్లాకు నష్టం చేయాలని చూస్తే ఇక్కడి ప్రజలు తిప్పికొడతారు.

-నాగా సీతారాములు, ఏఐసీసీ సభ్యుడు, కొత్తగూడెం

'విభజన భారత్' కోసం కాంగ్రెస్ కుట్రలు

బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ విమర్శ

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చాలని తమ పార్టీ చూస్తుంటే, 'విభజన భారత్' కోసం కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ కే లక్ష్మణ్ విమర్శించారు. తెలుగులో రూపొందించిన బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనేక పథకాలు, కార్యక్రమాలను మ్యానిఫెస్టోలో పొందుపరిచినట్టు తెలిపారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి, దేశ సమగ్రత, సమైక్యతను కాపాడటమే ధ్యేయంగా బీజేపీ సంకల్ప పత్రాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు 6 గ్యారెంటీలు వందరోజుల్లో అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తేనే హామీలు అమలు చేస్తామంటూ మరోసారి మభ్యపెడుతున్నారని మండిపడ్డారు.

నేలతల్లి సంరక్షణకు ప్రజలంతా సిద్ధమవ్వాలి

● ధరిత్రీ దినోత్సవం సందర్భంగా మంత్రి సురేఖ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): నేలతల్లి సంరక్షణకు ప్రజలంతా ఇప్పటికైనా సిద్ధం కావాలని అటవీ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఆమె ఆదివారం ఒక సందేశం ఇచ్చారు. పుడమి సంరక్షణ చర్యలను ఒక ఉద్యమంగా చేపడితేనే భావితరాల మనుగడ సాధ్యమవుతుందన్నారు. మనుషుల మితిమీరిన అవసరాలు, అనాలోచిత చర్యలతో భూమి తన జీవాన్ని కోల్పోతున్నదని, దీంతో సమస్త ప్రాణికోటికి నష్టం జరుగుతున్నదని తెలిపారు. ప్లాస్టిక్‌తో పుడమి ఉనికి ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఐక్యరాజ్య సమితి ఈ ఏడాది 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ (ప్లాస్టిక్ మీద భూగ్రహ సమరం)' ప్రకటించిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతి ప్రళయంగా మారకముందే ప్రజలంతా మేలుకోవాలని సూచించారు.

ఎండుతున్న ఎల్లంపల్లి

మొదటిపేజీ తరువాయి...

నెలల క్రితం వాటర్‌హబ్‌గా కళకళలాడిన శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయ ప్రాంతం ప్రస్తుతం ఎడారిని తలపిస్తున్నది. గత పదేండ్లలో ఏనాడూ తాగు, సాగునీటికి సమస్య లేని దిగువ మానేరు కూడా డెడ్‌సోరేజీకి చేరింది. మంచినీళ్లు కూడా అందివ్వలేని దుస్థితిలో చిక్కుకున్నది. రెండు కొండల మధ్య నిండుకుండలా కనువిందు చేస్తూ, కొండపోచమ్మ వరకు నీటిని అందించేందుకు దోహదపడిన అన్నపూర్ణ రిజర్వాయర్ సైతం అడుగంటిపోయింది. ఇంత జరుగుతున్నా, మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు అవకాశం ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ససేమిరా అంటున్న తీరు సాగు, అటు తాగునీటి సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నది.

రాజన్న సిరిసిల్ల జిల్లా అనంతగిరిలో నీళ్లు లేక అడుగంటిన అన్నపూర్ణ రిజర్వాయర్

ఎల్లంపల్లిలో 6.75 టీఎంసీల నీరు

ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6.75 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. నిరుడు ఇదే సమయంలో 13.5 టీఎంసీల నీటితో కళకళలాడింది. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటును సాకుగా చూపి, ఎత్తిపోతలను నిలిపివేయడంతో ఎల్లంపల్లి ఎండిపోతున్నది. ఈ ప్రాజెక్టు నుంచి ఏటా హైదరాబాద్‌కు 10 టీఎంసీలు, ఎన్టీపీసీకి 6.5 టీఎంసీలతోపాటు మిషన్‌భగీరథ, రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)కు నీటిని సరఫరాచేయాల్సి ఉన్నది. వీటితోపాటు 1.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ఈ ప్రాజెక్ట్‌ను డిజైన్ చేశారు. గత పదేండ్లలో ప్రాజెక్టు పరిధిలో నీటికి ఎప్పుడూ ఢోకా రాలేదు. ఏ మాత్రం నీరు తగ్గినా మేడిగడ్డ నుంచి ఎత్తిపోసేవారు. కానీ, ప్రస్తుత పరిస్థితి దయనీయంగా మారింది. అబుల్ కలాం సుజల స్రవంతి పథకం కింద ఏటా 10 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు సరఫరా చేయడానికి బ్రాహ్మణపల్లి వద్ద పంపుహౌస్ ఏర్పాటుచేశారు. ప్రాజెక్టులో 141 మీటర్లపైన నీరు ఉంటేనే ఈ పంపుహౌస్‌కు నీరు అందుతుంది. నీటిమట్టం ప్రస్తుతం 141.5 మీటర్లకు పడిపోయింది. ఒకటి రెండు రోజుల్లో పంపుహౌస్‌కు నీరు అందే పరిస్థితి లేదు. దీంతో డెడ్‌స్టోరేజీ నుంచి 20 పంపుల ద్వారా నీటిని ఎత్తి పంపుహౌస్‌కు పంపే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి నిత్యం 178.88 మిలియన్ గ్యాలన్ల నీటిని హైదరాబాద్‌కు సరఫరా చేయాల్సి ఉన్నది. కానీ, ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గడంతో గత కొద్దిరోజులుగా 174.34 మిలియన్ గ్యాలన్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ పరిమాణం రోజురోజుకూ తగ్గిపోతున్నది. మరో రెండు మూడు రోజులు గడిస్తే ఈ నీటిని కూడా హైదరాబాద్‌కు తరలించడం కష్టమేనని అధికారులు చెప్తున్నారు. దీంతో, ప్రాజెక్టులో రోడ్డు వేసి డెడ్‌స్టోరేజీ నుంచి ఎత్తిపోసి పంపుహౌస్‌ను నడిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్ని పంపులు పెట్టినా, హైదరాబాద్‌కు ఇవ్వాల్సినంత నీటిని సరఫరా చేయలేమని అధికారులు చెప్తున్నారు. హైదరాబాద్‌కు మంచినీటి సమస్య పొంచి ఉన్నట్టే. మోటర్ల ద్వారా పంపుహౌస్‌కు ఎత్తపోసే నీటి నుంచే ఆర్ఎఫ్‌సీఎల్‌తోపాటు మిషన్‌భగీరథకు వాడుకోవాల్సి ఉంటుంది. మరోవైపు ఈ ప్రాజెక్టు నుంచే ఎన్టీపీసీకి కూడా నీళ్లు ఇవ్వాల్సి ఉన్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 1.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నది. కాంగ్రెస్ పాలనలో ఆ ఊసే లేకుండా పోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒకవైపు సాగు, తాగునీటిని అందిస్తూ, మరోవైపు ఎత్తిపోతల పథకం కింద కొండపోచమ్మసాగర్ వరకు నీటిని అందించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా తయారైంది. ఇంత జరుగుతున్నా, మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఎన్నో అవకాశాలున్నాయని నిపుణులు చెప్తున్నా, ప్రభుత్వం మాత్రం పెడచెవిన పెడుతున్నదన్న విమర్శలొస్తున్నాయి.

అడుగంటిన అన్నపూర్ణ.. ఎడారిలా మధ్యమానేరు

వాటర్‌హబ్‌గా పేరొందిన శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం సామర్థ్యం 27.55 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.98 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. దాదాపు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నది. ఈ ప్రాజెక్టుపై పెట్టుకున్న ఆశలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అడియాసలయ్యాయి. నిరుడు ఇదే సమయంలో ప్రాజెక్టులో 16 టీఎంసీల నీరు ఉన్నది. కాళేశ్వరం ఎత్తిపోతలు లేకపోవడం, ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు వెనుక భాగం మొత్తం ఎడారిని తలపిస్తున్నది. మధ్యమానేరు ప్రాజెక్టు నుంచి ఎగువకు అంటే కొండపోచమ్మ ప్రాజెక్టు వరకు నీళ్లు వెళ్లాలంటే, ముందుగా అన్నపూర్ణ రిజర్వాయర్‌కు తరలించాలి. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో రెండు కొండల మధ్య నిర్మించిన అన్నపూర్ణ రిజర్వాయర్ సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.5 టీఎంసీలు మాత్రమే ఉన్నది. ఈ ప్రాజెక్టును నింపి, అక్కడి నుంచి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌కు, అక్కడి నుంచి ఎగువ మానేరు వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోల ద్వారా ప్రాజెక్టులను నిండుకుండలా నింపింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నపూర్ణ రిజర్వాయర్ ప్రకృతి రమణీయంగా ఉండేది. రెండు కొండల మధ్య ఉన్న ఈ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు సైతం సిద్ధం చేసింది. అటువంటి ప్రాజెక్టు ప్రస్తుతం అడుగంటి పోయింది. కనుచూపు మేరలో నీటిచుక్క కనిపించడం లేదు. మధ్యమానేరుకు దిగువన ఉన్న దిగువమానేరు జలాశయం సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.208 టీఎంసీలు మాత్రమే ఉన్నది. ఇది కూడా దాదాపు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నది. ఈప్రాజెక్టుకు పక్కనే ఉన్న కరీంనగర్ కార్పొరేషన్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోజూ మంచి నీరు సరఫరా చేసేవారు. ఇప్పుడు రెండు రోజులకోమారు సరఫరా చేస్తున్నారు. నిజానికి కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 24 గంటలపాటు మంచినీటి సరఫరాకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. ఆ మేరకు పనులు కూడా చేసింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిత్యం నీళ్లు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

ప్రభుత్వం భేషజాలు వీడితేనే సమస్యకు పరిష్కారం

కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం భేషజానికి పోతున్నదన్న విమర్శలున్నాయి. మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగినా కాపర్‌డ్యాం ఏర్పాటుచేసి, కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టులను నింపవచ్చుంటున్న నిపుణుల సూచనలను ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. దీంతో రాష్ట్రంలో నీటి సంక్షోభం తీవ్రమయ్యే పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే, ప్రాజెక్టుల్లో నీళ్లు లేక భూగర్భజలాలు అడుగంటి పోయాయి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో పాతకాలపు కరవుఛాయలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం వరద కాలువను మూడు రిజర్వాయర్లుగా మలచడం వల్ల 122 కిలోమీటర్ల కాలువ పొడవునా ఉన్న పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పైకి ఎగజిమ్మాయి. ప్రస్తుతం ఈ ప్రాంత రైతులంతా మళ్లీ బోర్ల బాట పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని మెట్ట ప్రాంతం భూగర్భజలాలు పెంపుదల విషయంలో ఐఏఎస్‌లకే ఒక పాఠ్యాంశంగా మారగా, ఇప్పుడు అదే ప్రాంతం మళ్లీ కరువుకు కేరాఫ్‌గా మారుతున్నది. కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయకపోవడంతో ఈ యాసంగి సీజన్ వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి అన్నదాతలు నష్టపోయారు. భవిష్యత్తులో మంచినీటికి ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని కోణాల్లో ఆలోచించి యుద్ధ ప్రాతిపదికన మేడిగడ్డ న